కొత్త మెనూ ప్రారంభం

- సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో అమలు
- ప్రారంభించిన అధికారులు


ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఏఎస్పీ సురేందర్‌రావ్

ఆదిలాబాద్‌రూరల్: వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచిందని ఏఎస్పీ సురేందర్‌రావ్ అన్నారు. శనివారం డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. జిల్లాలోని వసతి గృహాల్లో అధికారులు పాల్గొని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కొలాం ఆశ్రమ పాఠశాలలో కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఏఎస్పీ సురేందర్ రావ్ పాల్గొన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చినా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రాసెస్ పుస్తకాన్ని విడుదల చేశారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను ఆహ్వానించి మెనూ గురించి వివరించారు. గతంలో ఉన్న డైట్ చార్జిల కంటే 40 శాతం పెంచి ఇస్తుందన్నారు. అలాగే ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తి గత పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ రావ్, ఉపాధ్యాయులు సురేందర్, ప్రభాకర్, హరిదాస్, భుజంగ్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలను శనివారం ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ సందర్శించారు. స్టోర్ రూంతో పాటు విద్యార్థుల కోసం వండిన భోజనం పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన డైట్ విధానాన్ని పాటించాలని కోరారు. విద్యార్థులకు ప్రతిరోజు అందించే భోజనం పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. స్టోర్ రూం, కిచెన్‌ను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

బేల: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన మెస్ ఛార్జీలతో అమలుకానున్న కొత్త మెనూతో పౌష్టికాహారం అందనుందని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేకాధికారి మనోహర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర బీసీ గురుకులంలో కొత్త మెనూ పట్టికను ఆవిష్కరించారు. అలాగే మెస్ కమిటీ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రంగన్న, జైనథ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సవాపురే విలాస్, గోరే విశాల్, మాజీ సర్పంచ్ ఇంద్రశేఖర్, దత్తా నిక్కమ్, తాక్రే సందీప్, నవీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాంసి: నూతన మెనూ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతుందని ఎంపీడీవో మోహన్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహంలో నూతన మెనూ ఎంపీడీవో ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సురేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సరుకుల పరిశీలన


బోథ్: సరుకులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

బోథ్: మండల వ్యాప్తంగా అన్ని హాస్టళ్లల్లో శనివారం ప్రభుత్వం విడుదల చేసిన మెనూ ప్రారంభమైంది. మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలా దేవి ప్రారంభించారు. హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం జరుగుతుందన్నారు. సరుకులను, రికార్డులను పరిశీలించారు. ప్రిన్సిపాల్ సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నార్నూర్: వంటలను పరిశీలిస్తున్న సంజీవ్ కుమార్


ఇచ్చోడ: నూతన మెనూ ప్రారంభిస్తున్న అధికారులు


బేల: వివరిస్తున్న ప్రత్యేకాధికారి మనోహర్‌రావు


తాంసి: ప్రారంభిస్తున్న ఎంపీడీవో మోహన్ రెడ్డి

గిరిజన ఆశ్రమ పాఠశాలలో..

తాంసి: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో నూతన మెనూ ప్రత్యేకాధికారి రవీందర్ ప్రారంభించారు. మొదటగా గిరిజన పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. మెనూ ప్రభుత్వం అందిస్తున్న వసతులను వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సంతోష్, హాస్టల్ వార్డెన్ హరీశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నార్నూర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం అన్ని వసతి గృహాల్లో న్యూ కామన్ డైట్ మెనూ అమలు చేస్తుందని మండల ప్రత్యేకాధికారి గంగాధర్ అన్నారు. శనివారం మండలంలోని తాడిహత్నూర్, మాన్కాపూర్, జామడా, నార్నూర్, భీంపూర్ బాల బాలికల ఆశ్రమ పాఠశాలలు, ఎస్సీ వసతి గృహాల్లో కొత్త మెనూను ప్రారంభించారు. ఈసందర్భంగా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తాడేహత్నూర్‌లో ఎంఈవో అనిత, బాలికల ఆశ్రమ పాఠశాల నార్నూర్‌లో సీడీపీవో శారద, బాలుర ఆశ్రమ పాఠశాల నార్నూర్‌లో ఎంపీడీవో జవహర్, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఝురి మెడికల్ ఆఫీసర్ సంజీవ్ కొత్త మెనూ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, విట్టల్ వందన, రాజశేఖర్, తిరుమల, తదితరులు పాల్గొన్నారు.


ఇచ్చోడ: స్టోర్ రూంను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్‌రాథోడ్

ఇచ్చోడ: మండలంలో పలు ప్రభుత్వ ఆశ్రమ, గిరిజన గురుకుల, మైనార్టీ గురుకుల పాఠశాలలతో పాటుగా వసతి గృహాల్లో శనివారం అధికారులు నూతన మెనూను ప్రారంభించారు. మైనార్టీ గురుకుల కళాశాలలో ఎంపీవో సత్యనంద్, సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఎంపీడీవో లక్ష్మణ్, గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ఆర్సీవో గంగాధర్, బాలుర పాఠశాలలో ప్రిన్సిపాల్ గోవర్ధన్ కామన్ డైట్ మెనూ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్ల, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐటీడీఏ ముట్టడి విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: కొలాం సేవా సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 16న చేపట్టనున్న ఐటీడీఏ ముట్టడిని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గోవింద్‌రావ్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కొలాం తెగ అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐటీడీఏకు మంజూరు చేస్తున్న నిధులను తమ తేగ అభివృద్ధి, సంక్షేమానికి ఖర్చు చేయకుండా వాటిని పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. కొలాం తెగకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కుమ్రం సూరు యువ సేన జిల్లా అధ్యక్షుడు కుమ్ర రాజు, తదితరులు పాల్గొన్నారు.

తపస్ ధర్నా విజయవంతం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇచ్చోడ: హైదరాబాద్‌లో ఈనెల 17న నిర్వహించనున్న టీపీయూఎస్(తపస్) ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపికృష్ణ కోరారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో దీక్ష పోస్టర్ ఆవిష్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా పెండింగ్ బిల్లుల సమస్యలు పరిష్కరించాలన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా.. సమస్యలు పరిష్కారించలేదన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా వేల మంది ఉపాధ్యాయులతో ధర్మాగ్రహ దీక్షల చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తపస్ సంఘం నాయకులు దరంసోత్ అంబాజీ, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ముడుపు ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం: సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు అవుతుందని, శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. అమరు త్యాగాలను స్మరించుకోవాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ చేస్తున్న కృషిని చాటాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ముడుపు నళినీరెడ్డి, అరుణ్‌కుమార్, కుంటాల రాములు, భాస్కర్, మహబూబ్ ఖాన్, గణేశ్, స్వామి, నర్సింగ్‌రావు, గంగారెడ్డి పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న అన్నమొల్ల కిరణ్

ఎదులాపురం: ఆశ కార్యకర్తల బస్సుజాత సభను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. ఆశకార్యకర్తలతో కలిసి సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యల సాధనే ధ్యేయంగా బస్సుజాత కొనసాగుతుందన్నారు. ఫిబ్రవరిలో రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సమస్యలపై చర్చించి పరిష్కరించాలన్నారు. కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సుజాత, నాయకులు ఆశ, శాంత, పద్మ, లక్ష్మి, పుష్ప, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

కాడే స్వామి సేవలు అభినందనీయం


దుప్పట్లు పంపిణీ చేస్తున్న కాడే స్వామి

తలమడుగు: పేద బడుగు, గిరిజన ప్రజలకు మహారాష్ట్ర బ్యాంక్ స్పెషల్ ఆఫీసర్ కాడే స్వామి సేవలు అభినందనీయమని జగిత్యాల్ జిల్లా తహసీల్దార్ విశ్వంబర్, తలమడుగు ఎంఈవో వెంకట్‌రావ్ అన్నారు. శనివారం మండలంలోని రత్నాపూర్ గ్రామంలో గిరిజన వృద్ధులకు 30 మందికి దుప్పట్లు, 30 మంది విద్యార్థులకు స్వెటర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సొంత డబ్బుతో గిరిజనులకు దుప్పట్లు, స్వెటర్లు, బ్యాగులు, విద్యార్థులకు, నోటుబుక్‌లు, పెన్సిళ్లు అందించడం సంతోషంగా ఉందన్నారు. కాడే స్వామి ని ఆదర్శంగా తీసుకొని దాతలు సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు.

సీఆర్టీల డిమాండ్లు నెరవేర్చాలి


మంత్రికి సమ్మె నోటీస్ అందజేస్తున్న సీఆర్టీలు

నేరడిగొండ: డిమాండ్లు నెరవేర్చాలని ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న 1200 మంది సీఆర్టీలు ఆందోళన బాట పట్టనున్నారు. సీఆర్టీల యూనియన్ పిలుపు మేరకు ఈనెల 16నుంచి సమ్మె చేయనున్నారు. శనివారం మండలంలోని లఖంపూర్ ఆశ్రమ పాఠశాలకు వచ్చిన మంత్రి సీతక్కకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈనెల 16న ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మెలో పాల్గొననున్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా పని చేస్తున్న తమకు తక్కువ వేతనాలు ఇస్తున్నారని మండిపడ్డారు. సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేయగా పరిశీలిస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్, వినంత్రావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సోమేశ్వర్ పవార్, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

బోథ్: బోథ్ జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మౌనిక మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం ద్వారా సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందన్నారు. ఎస్‌టీసీ అడ్మిషన్ ద్వారా 265 కేసుల్లో రూ. 2,65,000, సీసీ అడ్మిషన్ 21 కేసులకు రూ. 68,000, ఎక్సైజ్ అడ్మిషన్ 17 కేసులకు రూ. 85,000, బ్యాంకు అదాలత్ ద్వారా రూ. 17,58,335లు రికవరీ అయినట్లు తెలిపారు. రాజీ మార్గం ద్వారా 28 కేసులు, సివిల్ తగాదాల్లో 2 కేసులు పరిష్కారం అయినట్లు పేర్కొన్నారు.

ఉన్ని దుస్తుల తయారీపై శిక్షణ

ఆదిలాబాద్‌టౌన్: డాక్టర్ రవికిరణ్ యాదవ్ సాయి వైకుంఠ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు ఉన్ని దుస్తుల తయారీపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్ట్ సభ్యుడు శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. ఉన్నితో తయారు చేసే స్వెటర్స్, మఫ్లర్, కాప్స్, సాక్స్, హ్యాండ్ బాగ్స్ తయారీపై శిక్షణ ఇవ్వనున్నట్లుగా పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళలు, యువతులు ట్రస్టు కార్యాలయంలో సంప్రదించి శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

నేరడిగొండ: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరుతూ శనివారం మండలంలోని లఖంపూర్ ఆశ్రమ పాఠశాలలో కొత్త డైట్ ప్రారంభోత్సవానికి వచ్చిన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖమాత్యులు సీతక్కకు జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 400 మంది జర్నలిస్టులు తమ విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా గురుతర బాధ్యతలు నిర్వహిస్తున్నామన్నారు. డబుల బెడ్ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల ఆర్థిక సాయం అర్హత కల్పించాలని, జర్నలిస్టులపై ప్రభుత్వం భరోసా కల్పిస్తూ వెల్ఫేర్ స్కీమ్ జర్నలిస్టులకు ప్రత్యేక కోటా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

అసహనం వ్యక్తం చేసిన లబ్ధిదారులు


అలస్యం కావడంతో వెళ్లిపోతున్న మహిళలు

బోథ్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక పరిచయ గార్డెన్‌లో శనివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ప్రజలు హాజరయ్యారు. ఉదయాన్నే వారు రావడంతో వారు కొంత అసహనానికి గురయ్యారు. మంత్రి సాయంత్రం రావడంతో లబ్ధిదారులకు ఆకలి వేసింది. గమనించిన అధికారులు వారికి సమోసాలు, అరటిపండ్లు అందించారు. కార్యక్రమం ఆలస్యం కావడంతో కొంత మంది వెళ్లిపోయారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజార్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఆర్డీవో వినోద్, తహసీల్దార్ సుభాష్ చందర్, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పూజలు


ముథోల్‌లో పడిపూజకు హాజరైన భక్తులు


ముథోల్‌లో పూజలు చేస్తున్న చంద్రమౌళి వెంకటేశ్ శర్మ


ఖానాపూర్‌లో స్వామివారి స్నాన ఘట్టం

ఖానాపూర్: పట్టణంలో అయ్యప్ప ఆరట్టు మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప ఆలయం నుంచి గోదావరి వరకు ఉత్సవ మూర్తులతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఉత్తర వాహిని గౌతమి గోదావరి నదీ తీరంలో గురుస్వామి పాపారావు, అర్చకులు నితీశ్, విజయ్ స్వామివారికి స్నాన ఘట్టం చేపట్టారు. కార్యక్రమంలో రాథోడ్ లత-రాము నాయక్, అడెల రాజన్న తదితరులున్నారు.

ముథోల్: మండలకేంద్రంలో శ్రీపశుపతి ఆలయ ఆవరణలో అయప్ప పడిపూజ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ చంద్రమౌళి వెంకటేశ్‌శర్మ చేతుల మీదుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. 18వసారి దీక్ష తీసుకున్న నారికేళ స్వామి, వరగంటి వినయ్, రోళ్ల బాలాజీలను సన్మానించారు. కార్యక్రమంలో గురుస్వాములు పోతన్నయాదవ్, అనిల్‌స్వామి, దత్తు, దుర్గ, మధు, పండరి, గోపాల్, అనిల్‌యాదవ్, ప్రవీణ్‌దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీబీపీలో ఉద్యోగం సాధించిన ఆరుష


ఆరుష

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన ఎర్రోళ్ల ఆరుష అనే యువతి ఐటీబీపీలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించింది. గత ఫిబ్రవరిలో నిర్వహించిన రాత పరీక్షల్లో ప్రతిభ కనబరిచింది. అనంతరం అక్టోబర్‌లో నిర్వహించిన ఫిట్ నెస్‌తో పాటు మెడికల్ టెస్టుల్లో ప్రతిభ కనబరిచి ఉద్యోగానికి ఎంపికైంది. జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతూ ఐటీబీపీ ఉద్యోగానికి సన్నద్ధమైంది. శనివారం విడుదల చేసిన ఫలితాల్లో ప్రతిభ కనబరిచి ఐటీబీపీలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించింది. యువతిని గ్రామస్తులు అభినందించారు.

అయ్యప్ప స్వాములకు భిక్ష

బోథ్: సొనాల గ్రామంలోని స్వామి ఇర్ల అభిలాష్ శనివారం అయ్యప్ప స్వాములకు భిక్ష నిర్వహించారు. అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భిక్షలో పాల్గొన్న అయ్యప్ప స్వాములకు భగవద్గీతను అందజేశారు. కార్యక్రమంలో అయ్యప్పస్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఛాయ్ తాగుతూ ఎమ్మెల్యే మాటామంతి


ఛాయ్ హోటల్‌లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: బోథ్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సాధారణ హోటల్‌లో ఛాయ్ తాగుతూ స్థానికులతో ముచ్చటించారు. శనివారం మండల కేంద్రంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కార్యకర్తలతో కలిసి టీ తాగారు. తాను సాధారణ కార్యకర్త స్థాయి నుంచి వచ్చానని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకులు ముందస్తు అరెస్ట్


ఉట్నూర్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

బోథ్: బోథ్ మండలంలో శనివారం ఇన్‌చార్జి మంత్రి సీతక్క పర్యటించిన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బీఆర్ఎస్ నాయకులను బోథ్ పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. రుణమాఫీ కానీ రైతులతో ఆందోళనలకు బీఆర్ఎస్ నాయకులు పిలుపునివ్వడంతో పోలీసులు అప్రమత్తయ్యారు. ఈమేరకు ఉదయాన్నే నాయకులను అదుపులోకి తీసుకున్నారు. బోథ్ మండలంలో మాజీ సర్పంచ్‌లు శ్రీధర్ రెడ్డి, సురేందర్, రైతు సంఘం అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్‌లను అదుపులోకి తీసుకున్నారు.

అరెస్టు చేయడం అప్రజాస్వామికం

ఉట్నూర్‌రూరల్: మండలంలో శనివారం మంత్రి సీతక్క పర్యటన నేపథ్యంలో స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద బీఆర్ఎస్ నాయకులు సీతక్కను అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జైవంత్‌రావు మాట్లాడుతూ.. నాయకుల అరెస్ట్ అప్రజాస్వామికమని అన్నారు. వాంకిడి గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో మృతి చెందిన శైలజ కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలన్నారు. రూ. 20 లక్షల రూపాయలు అందచేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలన్నారు. బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, మాజీ వైస్ ఎంపీపీ సలీమొద్దిన్‌లు, కేంద్రే రమేశ్, కొమ్ము విజయ్, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.


బోథ్ పోలీస్‌స్టేషన్‌లో..

‘బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి’

ఖానాపూర్: బీఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధినే.. కాంగ్రెస్ ప్రభుత్వం తాము చేస్తున్నట్లు చూపుతుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజగంగన్న అన్నారు. శనివారం పట్టణంలోని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ జాన్సన్‌నాయక్ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు.. నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. గజేందర్, రాజు, శ్రావణ్, అర్షద్, షఫి, మహిపాల్, తిరుమలేశ్, వంశీ పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

మామడ: ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు క్రమశిక్షణ అలవడటంతోపాటు శారీరకంగా, మానసికంగా దృఢంగా మారుతారని ఆదిలాబాద్ 32టీ బెటాలియన్ ఎన్‌సీసీ నాయబ్ సుబేదార్ జగదీప్‌సింగ్ అన్నారు. శనివారం మండలంలోని పొన్కల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ కేడెట్లతో పరేడ్ నిర్వహించారు. ఆయుధాల శిక్షణ, మ్యాప్‌రీడింగ్, ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్షలకు సన్నద్ధత గురించి వివరించారు. కార్యక్రమంలో హవల్దార్ అశోక్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు మైస అరవింద్‌కుమార్, ఎన్‌సీసీ అధికారి పూర్ణచందర్ ఉన్నారు.

ప్రొటోకాల్ పాటించడం లేదని ఆందోళన


ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నేరడిగొండ: మండలంలోని లక్కంపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో నూతన మెనూ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్కకు స్వాగతం పలుకుతూ అధికారులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అయితే ఫ్లెక్సీలో ఎమ్మెల్యే అనిల్ జాధవ్ ఫొటో లేకపోవడంతో బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ఆందోళన చేపట్టారు. గిరిజన ఎమ్మెల్యే అయినందున ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని మండిపడ్డారు. కనీసం అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సముదాయించారు.